# ఉగాది దేవత

(గల్పిక)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

గొప్ప అయిదంతస్తులమేడ కెదురుగా చిన్నగుడిసెముందు ఒక్కచిక్కిన అబ్బాయి ఒకడు కూచుని తదేకధ్యానంతో చూస్తున్నాడు. ఎందుకు చూస్తున్నాడంటే, ఆ మేడలోకి ఒక దేవత వెళ్ళింది. ఆవిడ మళ్లీ ఎప్పుడు బయటికి వస్తుందా అని అబ్బాయి చూస్తున్నాడు.

ఆ దేవత కాళ్లకి పసుపూ పారాణీ పెట్టుకుని, కొత్తచీరె కట్టుకుని, అనేక నగలూ ఆభరణాలూ పెట్టుకుని, మెడలో ఆకుల తోరణాలు ధరించి, శిఖలో పూత తురిమి, అంతదూరానికే భక్ష్యాల వాసనకొట్టింది.

త్వరలోనే ఆ దేవత ఆ మేడలోనుంచి బయటికి వచ్చి ఎదురుగా ఉన్న పూరిగుడిసెకేసి చూడకుండా పక్కగాఉన్న మరొక మేడకేసి మళ్లుతున్నది.

"ఓ దేవతా!" అని పిలిచాడు అబ్బాయి.

దేవత ఆగి అబ్బాయిని చూసింది.

"ఇట్లారా!"

దేవత వచ్చింది.

"నువ్వెవరు?"

"నేను ఉగాదిదేవతను."

"వరసగా ఒక్కొక్క మేడలోకీ వెళ్లి వస్తున్నావు దేనికి?"

"ఇవాళ సంవత్సరాదికాదూ?"

"మేడల్లో ఉండేవాళ్లకేనా సంవత్సరాది?"

"అందరికీనీ."

"అయితే గుడిసెల్లోకి దేనికి రావూ?

"రాకూడదు."

"ఏం? నువ్విచ్చే బహుమానాలన్నీ ఆ మేడల్లోవాళ్లకే ఇవ్వాలా?".

"నేనేమీ బహుమానాలివ్వటంలేదే, ఎవరి బహుమానాలు వాళ్లే సంపాదించుకుంటారు."

"అయితే మరినువ్వు వెళ్లి ఏం చేస్తావు?"

"ఏం చేస్తానా? విను. ఆ ఇళ్లలోఉన్న వారికి ఒక కొత్త ఉత్సాహం కలిగిస్తాను. అప్పుడు వాళ్లు పండగఉత్సాహంలో పడతారు. వాళ్లల్లో వాళ్లకు మామూలుగా ఉండే స్పర్ధలు ఇవాళ లేనట్టు నటిస్తారు. నన్ను ఇంటికి పోతే ఎంతో ఆదరంతో చూస్తారు, ఆరాధిస్తారు, నాకోసం పాటలు పాడుతారు. ఈవాళ్లలా నన్ను మరిచిపోరు. రేపూ ఎల్లుండీకూడా నేను వాళ్లమనస్సుల్లో మెదులుతూ ఉంటాను. ఇందుకే నేను వాళ్ల గడప తొక్కేది."

"నువు నాతో అబద్ధాలాడుతున్నావు. నువు దేవతవు. ఆ మేడల్లోవాళ్లకేదో మేలు చేసివస్తున్నావు. గుడిసెల్లోవాళ్లంటే నీకు లోకువ. అందుకనే నువు గుడిసెల్లో అడుగు పెట్టవు."

"నేనబద్ధం ఆడటంలేదు. కావటానికి నేను దేవతనేగాని, అందరు దేవతల్లేనే నేనుకూడా ప్రజల ఆరాధన కోరుతానుగాని ప్రజలకేమీ ఇవ్వను. ఇస్తున్నానని వాళ్లు భ్రమపడతారు. గుడిసెల్లోవాళ్లు నన్ను ఆరాధించరు. భ్రమాపడరు."

"ఒక్కసారి మా గుడిసెలో అడుగుపెట్టు, ఉగాది దేవతా! మేం కూడా నిన్ను ఆరాధిస్తాం. రేపూ ఎల్లుండీ కాదు ఏడాది పొడుగునా నిన్ను జ్ఞాపకం ఉంచుకుంటాం."

ఉగాదిదేవత కొంచెం తటపటాయించి, "సరే వస్తున్నా పద," అంటూ ఆ అబ్బాయి గుడిసెలో ప్రవేశించింది.

మరుక్షణమే ఆమెతలలో ఉండినపూత వాడిపోయింది. ఆమెజుట్టు ఎండి అట్టలు కట్టుకుపోయింది. మెడలో ఆకుతోరణాలు మాయమైనాయి. కొత్తచీరెకాస్తా చింకిపాత అయింది. పాదాలమీద పసుపూ, పారాణీ ఉండటానికి బదులు అడుసున్నది. దేవతవొంటిన ఒక్క నగగాని ఆభరణం గాని లేదు.

అబ్బాయి నిర్ఘాంతపోయి, "ఏమిటీమాయ వేషం?" అన్నాడు.

"అవును, నాయనా! మాయవేషమే! కాని నువు చూసేదిమాత్రం మాయవేషం కాదు. ఆ మేడల్లోవాళ్లు చూసినదే మాయ వేషం... నేను వేషం వేసుకుతిరుగుతున్న మామూలురోజునే!" అంటూ ఉగాది దేవత అంతర్ధానమయింది.

---

## గర్భ నిరోధిని

శరీరారోగ్యమునకు భంగంలేకుండ కొంత కాలమువరకు గర్భం రాకుండ ఆపుటకు ఔషధం రు. 10 లు. చాలాకాలంవరకు రాకుండ చేయుటకు రు 25 లు. వి. పి. చార్జి రు 1-0-0

## పుంస్త్వ వర్ధని తైలం

నరములు బలహీనత చెంది సంతోష సౌఖ్యములకు దూరమై దుఃఖించువారల పాలిట వర ప్రసాదిని మా నపుంసక తైలం. 1 సీసా రు. 10 లు. వి. పి. చార్జి రు 1-0-0 మరియు నేపాళదేశపు కస్తూరి, అంబర్ హేమం కలసి ప్రత్యేకంగా తియారుచేయబడి జగత్ప్రఖ్యాతి వహించిన తైలము గలదు. సీసా 1 కి రు 25 లు. వి. పి. చార్జి రు 1. ఆర్డర్లిచ్చువారు ముందుగా పైకం పంపుచూ జవాబుకు కవరు పంపేది.

డాక్టర్ రత్నం సన్సు,

మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్, దక్కన్